హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	218	248
సూర్యాపేట	రూ.140	200	230
నల్లగొండ	రూ.140	204	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 25.2



కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. రూ.60వేల కోట్లతో
మూసీ ప్రక్షాళన

- ఎస్ఎల్‌బీసీ, బస్వాపూర్ ప్రాజెక్ట్ సహా సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తాం
- యాదాద్రిని యాదగిరి గుట్టగా మారుస్తాం
- కోడ్ ముగిశాక భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం
- నాతోపాటు వెంకట్‌రెడ్డికే సీఎం అయ్యే అర్హత ఉంది
- లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, కేడీకి బుద్ధి చెప్పాలి
- భువనగిరి సభలో సీఎం రేవంత్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 21: ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నదుల్లో ఒకటిగా ఉన్న మూసీ నదిని రూ.60 వేల కోట్లతో ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం రాత్రి భువనగిరిలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి డబుల్ ఇంజన్ లాంటివారని, ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే త్రిపుల్ ఇంజన్‌లా భువనగిరి అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వివక్షకు గురైన ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తామని, అసంపూర్తిగా ఉన్న బస్వాపూర్ ప్రాజెక్టుకు రూ.400కోట్లు కేటాయించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భూనిర్వాసితులకు పరిహారం అందజేసి మిగులు పనులు పూర్తిచేసి ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తామన్నారు. గంధమల్ల ప్రాజెక్టును పూర్తిచేస్తామని, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల రైతులకు సాగు నీరందించే ధర్మారెడ్డి, బునాదిగాని, మూసీ కాల్వల పనులను పూర్తిచేస్తామన్నారు. యాదాద్రిని యాదగిరిగుట్టగా మారుస్తూ భక్తులకు అవసరమైన వసతులను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కల్పిస్తామన్నారు. యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆనగా చెబుతున్నా ఆగస్టు 15వ తేదీలోపు రైతుల రూ.2లక్షల రుణమాఫీ పూర్తిచేస్తానని వాగ్దానం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోపే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని, 30వేల మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, కాదని ఎవరైనా అంటే భువనగిరి అడ్డాగా బహిరంగ చర్చకు కాంగ్రెస్ సిద్ధమని సీఎం సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీలో తనతోపాటు ముఖ్యమంత్రి అయ్యే అర్హత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే ఉందని, కోమటిరెడ్డి బ్రదర్స్ తనకు కుడి, ఎడమలైతే మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి తెలంగాణ కాంగ్రెస్‌కు ఉద్ధండులని సీఎం అన్నారు.

బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు

భువనగిరి కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్, బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల దాడి కొనసాగించారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌ను విమర్శించే అర్హత ఎవ్వరికీ లేదన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ప్రజల రక్తాన్ని పీల్చి మాజీ సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల నుంచే కూలిపోతోందని కేసీఆర్ ప్రచారం చేస్తున్నాడని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలహీన పరిచేందుకు బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. అందులో భాగంగా భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను ముందు పెట్టి వెనుకాల బీజేపీ అభ్యర్థికి మద్దతుగా బూర ఊదుతున్న నీచుడు కేసీఆర్ అని విమర్శించారు. ప్రభుత్వం పడిపోతుందని ఎవరైనా అంటే ఉరికించి కొడతామన్నారు. ప్రభుత్వమేమి ఫుల్ బాటిల్ కాదని ఎద్దేవా చేశారు. నల్లగొండ ఫ్లోరైడ్ పాపం ముమ్మాటికీ కేసీఆర్‌దే అని అన్నారు. బీజేపీ మతం, దేవుడు, కేంద్ర దర్యాప్తు సంస్థల కేంద్రంగా రాజకీయాలు చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీలేదని విమర్శించారు. దేశాన్ని మోదీ ముంచుతుండగా, రాష్ట్రాన్ని తన కుటుంబంకోసం ఓ కేడీ ముంచాడని, మోదీ, కేడీ ఇద్దరు ఒకటేనని అన్నారు. త్వరలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరడం ఖాయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్‌తో కలసి రావాలన్నారు. ఇప్పటికే సీపీఐ తమతో కలసి పనిచేస్తుండటం హర్షనీయమని, మరో వామపక్ష పార్టీ కూడ వారి నిర్ణయంపై పునరాలోచన చేసుకోవాలన్నారు.

జోష్ నింపిన సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో

అడుగడుగునా ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, ప్రజలు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం భువనగిరిలో నిర్వహించిన రోడ్‌షో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సీఎం హోదాలో తొలిసారిగా భువనగిరిలో పర్యటించిన రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, స్థానికులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. స్థానిక హైదరాబాద్ చౌరస్తాలో ఓపెన్‌టాప్ వాహనంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, మల్‌రెడ్డి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్‌షో నిర్వహించి వినాయకచౌరస్తా వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. సుమారు రెండు గంటల పాటు సాగిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌కు రహదారికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో బారులు తీరిన ప్రజలు, కార్యకర్తలు సీఎంపై పూల వర్షం కురిపించారు. షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు నిలువరించారు. అలాగే సీఎం ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. విపక్షాలపై వేసిన సెటైర్లు, విమర్శలకు ప్రజలు కరతాళ ధ్వనులతో మద్దతు పలికారు. జై కాంగ్రెస్, పీఎం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలనే నినాదాలతో కార్యకర్తలు హోరెత్తించారు.పోలీసులు భారీబందోబస్తు నిర్వహించారు. రోడ్‌షో అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

భారీ జనసందోహం.. ట్రాఫిక్ మళ్లింపు

సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌తో భువనగిరిలో భారీ జన సందోహం నెలకొన్నది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జన సమీకరణ చేయడంతో పాటు సీఎంను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో భువనగిరి జనసంద్రమైంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలను పట్టణ శివారు ప్రాంతాల్లోనే పోలీసులు నిలిపివేశారు. దీంతో వారందరూ కాంగ్రెస్ జెండాలను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ పట్టణంలోకి చేరారు. అలాగే ట్రాఫిక్‌ను పోలీసులు బైపాస్ రోడ్డుకు మళ్లించినా ఇక్కట్లు తప్పలేదు. ఇదే అదనుగా జేబుదొంగలు చేతివాటం చూపడంతో పలువురి జేబులకు చిల్లులు పడ్డాయి. డీసీపీ ఎం.రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు కొనసాగింది. సీఎం రోడ్‌షోను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మునిసిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాన్ని ముట్టుకుంటే మాడిపోతారు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముట్టుకుంటే కేసీఆర్, కేటీఆర్ సహా ఎవరైనా మాడి మసైపోతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరిలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ, నల్లగొండ ఎంపీ స్థానాన్ని ఐదు లక్షలు, భువనగిరి స్థానాన్ని నాలుగు లక్షల మెజార్టీతో కాంగ్రెస్ గెలుచుకోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో ఉమ్మడి జిల్లా సమస్యలకు నెలవుగా మారిందన్నారు. బీజేపీ కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రానికి, ఉమ్మడి జిల్లాకు చేసిందేమీ లేదని, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నా, నిధులు తేలేని దద్దమ్మ అని విమర్శించారు. తాను ఎంపీగా ఐదేళ్లపాటు పోరాడటంతో కేంద్రం ఎయిమ్స్‌కు రూ.1150కోట్లు మంజూరు చేసిందన్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులను మంజూరు చేయించానన్నారు. మునగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అసలైన ఆట ఇప్పుడే మొదలైందని, మరో 20 ఏళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ టార్గెట్‌లో ఓ పొట్టాయన మాత్రమే మిస్ అయ్యారని, కానీ త్వరలోనే అందుకు తగిన పరిహారం చూడనున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, మందుల సామేల్, వేముల వీరేశం మాట్లాడుతూ, అవినీతి బీఆర్ఎస్‌కు, దురహంకార బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని, తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు.



రిజిస్ట్రేషన్ శాఖకు
ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పడిపోయింది. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలకు నాలుగో విడత ఎన్నికలు ఉండటంతో అత్యధిక సమయం కోడ్ ఉండటంతో రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. రూ.50,000 మించి డబ్బు వెంట తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

- నల్లగొండ

- గణనీయంగా పడిపోయిన ఆదాయం
- తగ్గిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- డబ్బులు పట్టుకుంటారన్న భయంతో వెనకడుగు వేస్తున్న క్రయవిక్రయదారులు

లోక్‌సభ ఎన్నికలకు జిల్లాలో మే 13వ తేదీన పోలింగ్ ఉండగా, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. అయితే పోలింగ్ తర్వాత డబ్బు అధికమొత్తంలో తీసుకెళ్లినా పెద్దగా ఇబ్బందులు ఉండవు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పోలింగ్‌లోగా అధిక మొత్తంలో డబ్బు తరలించడం వల్ల ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశం ఉంటుంది. అయితే పోలింగ్ తర్వాత డబ్బు తరలింపుతో ఓటర్లను ప్రలోభపెట్టే అవకా శం లేకపోవడంతో దీనిపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్రం ప్రభుత్వంతోపాటు రాష్ట్రస్థాయి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు భావిస్తున్నారు.

డబ్బును పట్టుకుంటారనే భయం

ఆస్తుల కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్లకు భయపడుతున్నారు. ఆస్తులు విక్రయించిన వారికి డబ్బు ఎలా చెల్లించాలో తెలియని పరిస్థితి ఉంది. కొంతమంది అకౌంట్ల ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసి రిజిస్ట్రేషన్లు చేసుకుంటుండగా, మరికొందరు నగదునే కోరుతుండటంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో ఎన్నికల కోడ్‌కు ముందు ప్రతీరోజు 200 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ అయ్యేవి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక 40 నుంచి 50 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పడిపోయింది. రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడంతో డాక్యుమెంట్ రైటర్ల ఆదాయం కూడా తగ్గింది. దీంతో జీవనోపాధి కోల్పోతున్నామని డాక్యుమెంట్ రైటర్లు పేర్కొంటున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా రిజిస్ట్రేషన్ల శాఖపై ఎన్నికల కోడ్ ప్రభావం తీవ్రగా చూపింది. డబ్బు పట్టుబడతాయనే భయంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్లకు ముం దుకు రాలేదు. నాలుగు నెలల తేడాతో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మరోసారి రిజిస్ట్రేషన్లశాఖకు గండి పడింది. చాలామంది ఆస్తుల కొనుగోలుదారులు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని రిజిస్ట్రేషన్‌ను మాత్రం వాయిదా వేసుకుంటున్నారు. డబ్బు తీసుకువచ్చే సమయంలో ఎక్కడ పట్టుబడతాయో, ఎక్కడ తనిఖీలు నిర్వహిస్తారో అనే భయం క్రయ, విక్రయదారుల్లో ఉంది.లక్షల రూపాయల డబ్బు వెంట తీసుకెళ్తే అందుకు ఆధారాలు తప్పనిసరిగా చూపించాలి. ఎలాంటి ఆధారాలు లేకపోతే ఆ మొత్తాన్ని పోలీసులు సీజ్ చేసి పూర్తి విచారణ తరువాతే చెల్లిస్తారు.సదరు డబ్బుకు సంబంధించిన పత్రాలను చూపకపోతే ఐటీ శాఖకు ఆ మొత్తాన్ని అప్పగిస్తారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ ధర ప్రకారం సరైన డాక్యుమెంట్ ఆధారంగా డబ్బును వెంట తీసుకొనివెళ్లే అవకాశం ఉన్నా, లేనిపోని తలనొప్పులు ఎందుకని క్రయ, విక్రయదారులు ఆస్తుల రిజిస్ట్రేషన్లకు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖకు తిరిగి ఆదాయం సమకూరాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.రియల్ ఎస్టేట్ వ్యాపారంపై కూడా ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. చాలామంది కొనుగోలుదారులు ప్లాట్లు, స్థిర, చరాస్తుల కోసం అడ్వాన్స్ చెల్లించి కేవలం అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అనంతరమే రిజిస్ట్రేషన్లకు వారు సిద్ధపడుతున్నారు.

ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేటలో రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య తగ్గింది. 2023 మార్చి15 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు సుమారు 11వేలకు పైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగ్గా, రూ.31కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఏడాది ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మార్చి 15 నుంచి ఈ నెల 20వ తేదీ వరకు కేవలం 5వేల డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో ప్రభుత్వానికి రూ.11కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఎన్నికల కోడ్‌కు తోడు ప్రస్తుత నెలలో అధికంగా సెలవులు రావడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ నుంచి కొన్ని శాఖలకు సడలింపు ఇవ్వాలనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వానికి అధికంగా ఆదాయాన్ని ఇచ్చే స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖకు కొన్ని సడలింపులు ఇస్తే రిజిస్ట్రేషన్లకు ఢోకా ఉండదు. ఎన్నికల సంఘం మాత్రం అన్ని శాఖలకు కోడ్‌ను ఒకేలా అముల చేస్తుండటంతో రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయానికి గండిపడుతోంది.

ఎన్నికల కోడ్‌తో రిజిస్ట్రేషన్లు తగ్గాయి

లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. కోడ్ అనంతరం తిరిగి మళ్లీ రిజిస్ట్రేషన్లు పుంజుకునే అవకాశాలుంటాయి. ఎన్నికల కోడ్‌కు ముందు రిజిస్ట్రేషన్లు జరిగి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం సమకూరేది. ప్రస్తుతం నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతీరోజు 30నుంచి 40వరకు మాత్రమే డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.



- కోమటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, నల్లగొండ



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలి

- కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ విధ్వంసం
- ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అడ్రస్ ఉండదు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

•7లో..

బీజేపీ, కాంగ్రెస్ ఓటమి ఖాయం

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

•7లో..

పలుచోట్ల ఈదురుగాలులు

మోస్తరు జల్లులు



నల్లగొండ 11వ వార్డులో విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఆర్జాలబావి ఐకేపీలో ధాన్యం రాశులు తడవకుండా పట్టాలు కప్పిన రైతులు

నల్లగొండ, తిప్పర్తి, ఏప్రిల్ 21: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన మోస్తరు జల్లులు కురిశాయి. పెద్దఎత్తున ఈదురుగాలులు రావడంతో అప్రమత్తమైన రైతులు పలుచోట్ల ధాన్యం రాశులపై పట్టాలు కప్పారు.పగలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదుకాగా, సాయంత్రానికి ఈదురుగాలులతో వాతావరణ చల్లబడింది.జిల్లాలో అత్యధికంగా కట్టంగూరులో 41.7 డిగ్రీలు,అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకొండ్లలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. అక్కడక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండ 11వ వార్డు ముత్యాలమ్మ కాలనీలో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ స్తంభం నేల కూలింది. తిప్పర్తిమండలంలో జంగారెడ్డిగూడెం, రామలింగాలగూడెం,పజ్జూరుతోపాటు పలు గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. రైతులు వర్ష భయంతో ధాన్యం రాశులపై పట్టాలు కప్పారు. ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు ఈదురుగాలులకు లేచిపోయాయి.

ప్రశాంతంగా టీఎస్ఆర్‌జేసీ పరీక్ష

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 21: గురుకులాల్లో ప్రవేశాలకు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీఎస్ ఆర్‌జేసీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని 38 పరీక్ష కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. పరీక్షకు 8,890మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 7,405 మంది హాజరయ్యారు. 1,485మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను 38మంది చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ ఆరుగురు రూట్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించినట్లు డీఈవో భిక్షపతి తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, దర్శన లైన్లలో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 21: యాదగిరీశుడి సన్నిధిలో స్వయంభువులకు నిత్య పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట స్వామి అమ్మ వార్లకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. అదేవిధంగా శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్ర హవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం..

యాదగిరిక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాల్లో వచ్చారు. సుమారు 25వేల నుంచి 30వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మ దర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రద్దీతో కొనసాగాయి. ఆలయ ఖజానాకు రూ.44,63,708 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

రెండో విడతలో పద్మశ్రీ పురస్కారం స్వీకరణ

● కవి, రచయిత కూరెళ్ల విఠలాచార్య



రామన్నపేట, ఏప్రిల్ 21: రెండో విడతలో తాను పద్మశ్రీ అవార్డు అందుకోనున్నానని కవి కూరెళ్ల విఠలాచార్య అన్నారు. పద్మశ్రీ అవార్డులను ఈ నెల 22న ఢిల్లీలో ప్రదానం చేయనున్న నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కవి, రచయిత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య స్పందించారు. సోమవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన తనకు రాష్ట్రపతి నుంచి అవార్డును అందుకోవడానికి ఆహ్వానం రాలేదని, రెండో విడతలో తమకు ఆహ్వానం అందనుందని విఠలాచార్య తెలిపారు. మొదటి విడతగా కేతావత్ సోమ్‌లాల్ నాయక్‌తో పాటు మరికొందరు పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల ఓటమి ఖాయం

● మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

కనగల్ ఏప్రిల్ 21: బీజేపీ, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కోరారు. ఆదివారం రాత్రి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా కనగల్ ఎక్స్‌రోడ్డులో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. మోదీ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఎలాంటి మేలు జరగలేదన్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచి పేదలపై పన్నుల భారం మోపారని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. కేసీఆర్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కంచర్ల కృష్ణారెడ్డిని నల్లగొండ ఎంపీగా గెలిపించాలన్నారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆపార్టీ మండలధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌కుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంపీపీ కరీంపాష, జడ్పీటీసీ చిట్లవెంకటేశంగౌడ్, బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

గుర్రంపోడు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ పంటలకు నీరు ఇవ్వకుండా ఎండబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యామ మల్లేశం నామినేషన్ దాఖలు

● 25న భువనగిరిలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో

భువనగిరి టౌన్, ఏప్రిల్ 21: భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం సోమవారం నామినేషన్ వేయనున్నారు. బైపాస్ రోడ్డులోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంనుంచి పార్టీ నాయకులతో కలిసి నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాగా మల్లేశంకు మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్ 25న భువనగిరిలో రోడ్డుషో నిర్వహించనున్నారు. కేసీఆర్ రోడ్డుషోతో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావును విచారించాలి

● టీపీసీసీ మాజీ కార్యదర్శి దీరావత్ స్కైలాబ్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ నాయక్

మిర్యాలగూడ, ఏప్రిల్ 21: ఫోన్ ట్యాపింగ్ కేసులో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావును విచారించాలని టీపీసీసీ మాజీ కార్యదర్శి దీరావత్ స్కైలాబ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో భాస్కర్‌రావు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో సుమారు వంద మందిని పైగా బెదిరించినట్లు ఆరోపించారు. ఓ రైస్‌మిల్ యజమానిని బెదిరించి రూ.2కోట్లు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. డివిజన్ స్థాయి అధికారిని బెదిరించి తనకు అనుకూలంగా పనులు చేయించుకున్నారని ఆరోపించారు. వంద అబద్ధాలాడే కేసీఆర్ వెయ్యి అబద్ధాలాడే భాస్కర్‌రావుతో కలిసి ఓట్లడిగే నైతిక హక్కు లేదన్నారు. కేసీఆర్ బస్సు యాత్రను ప్రజలే స్వచ్ఛందంగా అడ్డుకుంటారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మాదిగ జాతి భవిష్యత్ కోసమే మద్దతు

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 21: మాదిగ జాతి భవిష్యత్ కోసమే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టంచేశారు. చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం రాత్రి భువనగిరి పార్లమెంట్ స్థాయి ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంస్థల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ జాతి భవిష్యత్ ఆధారపడి ఉందని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇవ్వడంతోపాటు అందుకు తగిన కార్యాచరణను పూర్తి చేశారని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు తీర్పు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసిందని, ఇది ఒక శుభపరిణామమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మాదిగలు మద్దతిచ్చే విషయాన్ని స్పష్టంగా చెప్పి అవగాహన కల్పించాలని, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేసి బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు మోసం చేశాయని, ఆ పార్టీలకు ఓట్లు వేయవద్దన్నారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తే, తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎమ్మార్పీఎస్‌ను చీల్చి, నిర్వీర్యం చేయడానికి కేసీఆర్ వందల కోట్లను ఖర్చు చేశారని, కేసీఆర్ ఒక చీటర్ అని ధ్వజమెత్తారు. తాను పదవుల కోసం కాకుండా మాదిగ జాతి భవిష్యత్ కోసమే ఉద్యమిస్తున్నానని, అదే బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పదవుల కోసం ఆయా పార్టీల్లో చేరి లక్ష్యాన్ని మరిచిపోయారని విమర్శించారు. మాదిగలకు పార్లమెంట్ టికెట్‌ల విషయంలో కాంగ్రెస్ మోసం చేసిందని, మాదిగలను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. మాదిగలకు తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి బీజేపీని గెలిపించాలని కోరారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ నాయకులు బోయ లింగస్వామి, లింగస్వామి పాల్గొన్నారు.

ఎల్లయ్య ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు ముమ్మరం

● అనుమానితుల కాల్‌డేటాను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు

సూర్యాపేటరూరల్, ఏప్రిల్ 21: సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె ఎల్లయ్య ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తును ముమ్మరంచేశారు. ఎల్లయ్య అదృశ్యమై నాలుగు రోజులు గడుస్తున్నా ఎలాంటి ఆచూకీ తెలవకపోవడంతో సూర్యాపేట, జగ్గయ్యపేట పోలీసులకు కిడ్నాప్ కేసు సవాల్‌గా మారింది. ఇరు రాష్ట్రాల పోలీసులు వేర్వేరుగా ఆరు బృందాలుగా ఏర్పడి విచారణను వేగవంతం చేశారు. అనుమానితుల సెల్‌ఫోన్ కాల్ డేటాను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

పలువురి అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు

కుటుంబసభ్యుల ఆరోపణల మేరకు ఎల్లయ్యకు వ్యక్తిగత, ఇతర విషయాల్లో విభేదాలు ఉన్న పలువురి వ్యక్తులను అదుపులోకి తీసుకొని వేర్వేరుగా పోలీసులు విచారిస్తున్నారు. అంతేకాకుండా అనుమానితుల కాల్‌డేటాను సేకరించే పనుల్లో పోలీసులు నిమగ్నమయ్యారు. ఎల్లయ్య తీసుకెళ్లిన కారు కూడా అతనిది కాదని సూర్యాపేటకు చెందిన కలప వ్యాపారిదిగా పోలీసులు గుర్తించారు. ఏది ఏమైనా ఎల్లయ్య ఆచూకీ తెలిస్తేకాని ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

జగ్గయ్యపేటకు తరలిన బంధువులు

ఎల్లయ్య స్వగ్రామమైన సూర్యాపేట మండలం యర్కారం గ్రామస్థులు, ఆయన అభిమానులు, బంధువులు అదృశ్యమైన జగ్గయ్యపేటకు ద్విచక్రవాహనాలపై వెళ్లి జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. రోజులు గడుస్తున్నా ఎల్లయ్య ఆచూకీ తెలవకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు.

మోడీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలి

● కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ విధ్వంసం ● ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అడ్రస్ ఉండదు ● పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది ● నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, జానారెడ్డి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్ట్ మోడీని చిత్తుచిత్తుగా ఓడించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి పట్టణంలోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారసభలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు తెలంగాణను ధ్వంసం చేశారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు డిపాజిట్ దక్కదన్నారు. నల్లగొండ ఎంపీ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డి 5 లక్షల మెజార్టీతో విజయం సాధించబోతున్నారని, ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో లక్ష ఓట్ల మెజార్టీ రావడం ఖాయమన్నారు. ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అడ్రస్ దొరకదన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 11మంది మంత్రులం మంచి క్రికెట్ టీమ్‌లా పనిచేస్తున్నామని, కేసీఆర్ ఫ్రస్టేషన్‌లో ఉన్నారని, ఆయన చిల్లర మాటలు పట్టించుకోవద్దన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండి మంచి పరిపాలన చేస్తుంటే 25 మంది ఎమ్మెల్యేలు ఆయనకు టచ్‌లో ఉన్నట్లు చెప్పడం దశాబ్దకాలపు జోక్ అని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లతో కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నాలుగేళ్లలో కూలిపోయిందని, ఆయన సాగర్ ప్రాజెక్ట్ గురించి, నీళ్ల గురించి, కరువు గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్‌లో 145 మంది ఎంపీలను సస్పెండ్ చేసి మోడీ నిరంకుశంగా వ్యవహరించారన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలలో ఎమ్మెల్యేలను కొనుగోలుచేశారని ఆరోపించారు. తెలంగాణలో సీపీఐ, సీపీఎం మద్దతు ఇవ్వడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కోదాడ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, బీఎల్‌ఆర్, పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, వేనేపల్లి చందర్‌రావు, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్న, గెల్లి అర్చనరవి, ముత్తవరపు పాండురంగారావు, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సాముల శివారెడ్డి, దొంతగాని శ్రీనివాసు, భూక్యా గోపాల్, అజీజ్‌పాషా, మంజూనాయక్, ఈదప్పగంటి సుబ్బారావు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శంకర్‌నాయక్, అమర్‌నాథ్‌రెడ్డి, భాస్కర్, కారింగుల వెంకటేశ్వర్లు, సతీష్, సంపత్‌రెడ్డి, కొట్టే సైదేశ్వరరావు, ఎస్‌కె సైదా, సుబ్బారావు, వెంకటరెడ్డి, నిజాముద్దీన్, మజీద్, మన్సూర్‌అలీ, మహేష్‌గౌడ్, శివరామ్‌యాదవ్, వేణుప్రసాద్, సీపీఐ రాష్ట్ర నాయకులు గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వజ్రం లాంటి వాడు : కూనంనేని

కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ వజ్రం లాంటివాడని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో మంత్రి ఉత్తమ్‌తో కలిసి కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. నాడు నల్లగొండ ఎర్రగొండగా ఉండేదని, తర్వాత కాంగ్రెస్ కంచుకోటగా మారిందన్నారు. నేడు కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పనిచేయడంతో నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త చరిత్రను ఆవిష్కరించబోతుందన్నారు. సోనియాగాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమన్నారు. దేశంకోసం ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీలాంటి వారు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. పదేళ్లపాటు యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పీఎం పదవికి సోనియా, రాహుల్‌లు పదవులకు దూరంగా ఉన్నారన్నారు. రాహుల్‌గాంధీ సాదా, సీదా మనిషని, మంచి యువకుడు రాహుల్‌ను ప్రధాన మంత్రిని చేయాలని, ఇండియా కూటమికి అందరు మద్దతు ఇవ్వాలన్నారు. మోదీ అత్యంత అవినీతి పరుడన్నారు. ఔరంగ జేబు, గజని లాంటి మనస్తత్వం కలిగిన మోడీ పదవి కోసం ఎంతకైనా తెగిస్తాడని, కుటుంబంలో ఎవరినైనా చంపగలుగుతారన్నారు. సీబీఐ, ఈడీలను ఉపయోగించి ప్రతిపక్షాలను అరెస్ట్ చేస్తున్నారన్నారు. దేశంలో మోడీ వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు.

రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్న మోడీ ప్రభుత్వం : జానారెడ్డి

దేశంలోని అంబేద్కర్ ఏర్పాటు చేసిన రాజ్యాంగానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచారసభలో ఆయన మాట్లాడారు. హిందూ ముస్లింల మధ్య గొడవలు పెట్టి మతం పేరుతో మోడీ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో ఎంతో అవినీతి జరిగిందని, ప్రాజెక్ట్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సోనియా, రాహుల్‌గాంధీల ఆధ్వర్యంలో ఇండియా కూటమి ద్వారా మంచి రోజులు రానున్నాయన్నారు.

కాంగ్రెస్‌కు ఓటువేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి : రఘువీర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల నాయకత్వంలో పనిచేసి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్లమెంట్‌లో ఉత్తమ్ మాదిరిగా నల్లగొండ గళం వినిపిస్తానన్నారు. బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలన్నారు.

లక్ష ఓట్ల మెజార్టీతో రఘువీర్‌ను గెలిపిస్తాం : పద్మావతిరెడ్డి

హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకంటే నల్లగొండ నుంచి అత్యధిక మెజార్టీతో రఘువీర్‌ను గెలిపిస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ అస్మానసీర్, దొంగరి మంగమ్మలు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, చావా కిరణ్మయి, మంజుల, అర్చన రవి, విజయ, విజయలక్ష్మీ, సంపత్‌రెడ్డి, సౌజన్య, ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంను గెలిపిస్తే సమగ్రాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

● భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 21: పిలాయిపల్లి కాల్వ సాధన కోసం అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి కాల్వను సాధించి రైతులకు అండగా నిలిచిన సీపీఎంకు ఓటేస్తే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని ధర్మారెడ్డిపల్లి, వంకమామిడి, దంతూరు, జిబ్లక్‌పల్లి, కనుముకుల తదితర గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజల నుంచి ఓట్లను అభ్యర్థించారు. ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ భూదాన్‌పోచంపల్లి అభివృద్ధికి సీపీఎం నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ కూలీల ఉపాధి కోసం సమరశీల పోరాటాలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జగదీష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, కట్ట నర్సింహ, గూడూరు అంజిరెడ్డి, కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మధు పాల్గొన్నారు.

ప్రశాంత్ కుటుంబానికి అండగా..

భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన ప్రశాంత్ మృతికి మొత్తం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జిబ్లక్‌పల్లిలో ఇటీవల చనిపోయిన ప్రశాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రశాంత్ కుటుంబానికి న్యాయం జరిగేవరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, నాయకులు జగదీష్, ఆమనగంటి వెంకటేష్, పగిల్ల లింగారెడ్డి, కోట రామచంద్రారెడ్డి, మధు, విష్ణు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మాడ్గులపల్లి, ఏప్రిల్ 21: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం రైల్వే ట్రాక్ వద్ద ఆదివారం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన కిరణ్ మిలి(34)తోపాటు ఐదుగురు పని నిమిత్తం గౌహతి నుంచి సికింద్రాబాద్‌కు రైలులో బయలుదేరారు. ఆదివారం ఉదయం కుక్కడం-మిర్యాలగూడ స్టేషన్ల మధ్యన కిలో మీటర్ నెం.106/8-9 వద్దకు రైలు రాగానే రైలులోని మెట్ల వద్ద కూర్చొన్న కిరణ్ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. గమనించిన ప్రయాణికులు చైన్ లాగి రైలును ఆపేశారు. రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైల్వే అధికారులు పరిశీలించగా కిరణ్ తీవ్ర గాయాలకు గురై మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ తెలిపారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రూ.6.29 లక్షల నగదు పట్టివేత

తిరుమలగిరి, ఏప్రిల్ 21: తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రైతండా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ తనిఖీల్లో రూ.6.29 లక్షలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా యాదాద్రి జిల్లా గుండాలకు చెందిన పట్ల రమేష్ వద్ద రూ.4.99లక్షలు, పాలకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల వెంకన్న వద్ద రూ.1.30లక్షలు, మొత్తం రూ.6.29 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌టీ టీంలీడర్ శ్రీనివాస్, ఎస్‌ఎస్‌టీ టీంలీడర్ నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది గోపినాయక్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న నల్లమట్టి

● ట్రక్కుకు రూ.1000 ● ప్రతిరోజు 500 ట్రక్కుల మట్టి తరలింపు ● రియల్ ఎస్టేట్ ప్లాట్లకు మట్టి చేరవేత



చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న స్థానికులు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21: హుజూర్‌నగర్ పట్టణంలోని పలు చెరువుల్లోని నల్లమట్టి కాసుల వర్షం కురిపిస్తోంది. గత 20 రోజుల నుంచి పట్టణంలోని మట్టపల్లి రోడ్డులోని పోతిరేనికుంట, సింగారం రోడ్డులోని భట్టువాని కుంట, మిర్యాలగూడ రోడ్డులోని అలకశంకర కుంట చెరువుల్లోని నల్లమట్టి కొంతమంది అక్రమార్కులకు వరంగా మారింది. హుజూర్‌నగర్‌లో మట్టే బంగారమాయే అన్న చందంగా మారింది. కొంతమంది నాయకులు, అధికారులు, మత్స్యకార్మిక సొసైటీ సభ్యులు సిండికేట్‌గా మారి లక్షల రూపాయల విలువచేసే మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రైతులు కొంతమంది పంట పొలాలకు చెరువు శిఖంలోని నల్లమట్టి తరలిస్తుండగా వారిని ఆసరాగా చేసుకుని ఇటుక బట్టీ వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్లాట్లను చదును చేసేందుకు నల్లమట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.800 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. ప్రతీరోజు సుమారు 500 ట్రాక్టర్ల చెరువు శిఖం మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వేపలసింగారం, మట్టపల్లి రోడ్డులోని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సుమారు 30 ఎకరాల్లో వెంచర్లు వేయగా ఆ వెంచర్లను చదును చేసేందుకు సుమారు 10వేల ట్రక్కుల నల్లమట్టిని తరలించారు. ఇదిలా ఉండగా మిర్యాలగూడ రోడ్డులోని అలకశంకర కుంట, పోతిరేనికుంటలలోని చెరువులనే ఆక్రమించేందుకు నల్లమట్టి పోసి చదును చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండదండలతో నాయకుల మితిమీరిన జోక్యం, కొంతమంది మత్స్యకార్మిక సొసైటీ సభ్యుల అధికార దాహంతో చెరువు మట్టిని లక్షల రూపాయలకు అమ్మడమే కాకుండా అసలు చెరువులనే పొలాలుగా చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా నల్లమట్టి వ్యాపారం మూడుపువ్వులు.. ఆరుకాయలుగా వర్ధిల్లుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని వేపలసింగారం చెరువులో నల్లమట్టిని తరలిస్తూ కాలువకట్టలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టగా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనా హుజూర్‌నగర్ పట్టణంలోని చెరువుల్లోని నల్లమట్టిని రైతుల పేరుతో అక్రమంగా తరలించడమే కాకుండా ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మట్టిని తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం : భిక్షం

చెరువుల నుండి అక్రమంగా మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ డీఈ భిక్షం హెచ్చరించారు. మట్టి తరలింపుపై ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. రైతులు మాత్రమే పంట పొలాలకు మట్టి తీసుకెళ్ళవచ్చన్నారు. ఇటుకబట్టీ వ్యాపారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మట్టి తరలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

● నోస్టాక్



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రం పరిధిలోని రాయిగిరి వైన్‌షాపు వద్ద కేఫ్(ఎస్), కేఫ్ (ఎల్)బీర్ల నోస్టాక్ బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో మద్యం ప్రియులు వెనుదిరిగి వెళ్లారు. వేసవి తాపంతో దాహం తీర్చుకుందామంటే బీర్లు లేకపోవడం విచారకరమని పలువురు మద్యం ప్రియులు పేర్కొంటున్నారు.

● భువనగిరి అర్బన్

నరేంద్రమోదీతోనే దేశంలో సుస్థిర పాలన

● భువనగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ● ఈ నెల 23న నామినేషన్‌కు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలి ● భూదాన్‌పోచంపల్లిలో బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 21: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీతోనే మోడీ 'త్రీడీ' డెవలప్‌మెంట్ (దేశం-ధర్మం-డెవలప్‌మెంట్) అనేవి సాధ్యమవుతాయని పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లిలో జరిగిన బీజేపీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామంలో వారాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో 52మంది బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశం ఎంతో ముందుకెళ్తుందన్నారు. ప్రపంచ దేశాలు మన దేశంవైపు చూస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో వికసిత భారత్‌గా దేదీప్యమానంగా దేశాన్ని తీర్చిదిద్దేందుకు నరేంద్రమోదీ ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. తనను మరోసారి ఎంపీగటా గెలిపిస్తే ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో భువనగిరి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భువనగిరిలో ఈ నెల 23న తను నామినేషన్ దాఖలు చేస్తున్నందున బీజేపీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని, సభకు హాజరయ్యే శ్రేణులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి టైఅండ్‌డై ఇక్కత్ బ్రాండ్‌తో హాజరుకావాలని కోరారు. సమావేశానికి బీజేపీ మండల అధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్ అధ్యక్షత వహించగా బీజేపీ రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, మాజీ సర్పంచ్ నోముల గణేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దబ్బికార్ సాయేష్‌కుమార్, నాయకులు గంజి బస్వలింగం, సుర్వంటి రంగారెడ్డి, పల్లెకాడి బసవయ్య, మేకల చొక్కారెడ్డి, బండిరాల సుశీల, తంద రమేష్‌గౌడ్, లింగయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: బీజేపీలో చేరిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆదివారం భువనగిరిలో బీఆర్‌ఎస్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు కర్రె బీరు మల్లయ్య, యువజన విభాగం మండల అధ్యక్షుడు గోపగాని ప్రసాద్‌గౌడ్‌తోపాటు పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి మరోసారి ప్రధానిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుంటుపల్లి సత్యనారాయణ, కాదూరి అచ్చయ్య, సుబ్బూరు వీరస్వామి, కర్రె మహేష్, గందమల్ల మహేష్, గవ్వల శ్రీశైలం పాల్గొన్నారు.

24న రఘువీర్‌రెడ్డి నామినేషన్ ర్యాలీ



మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, పక్కన మునిపిల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 21: నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ఈ నెల 24న నల్లగొండలో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన నల్లగొండ నియోజకవర్గ పార్టీ ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఈనెల 24న ఉదయం 10 గంటలకు నల్లగొండ పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్లగొండ నియోజకవర్గ నుంచి 70వేలకు పైగా మెజార్టీ తీసుకువస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దె సుమన్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు గడ్డం అనుపరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

దూర విద్యతో ఉద్యోగ అవకాశాలు



పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరమణ

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 21: దూర విద్యతో ఉద్యోగావకాశాలు దగ్గరవుతాయని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ త్రాసు వెంకటరమణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓయూకు న్యాక్ గుర్తింపు లభించిందన్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన అభ్యర్థులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన సర్టిఫికెట్స్ అందజేస్తారన్నారు. దేశ విదేశాల్లో చెల్లుబాటయ్యే కోర్సులు, సర్టిఫికెట్లు అందించే బీఆర్ అంబేడ్కర్ ఓయూ సేవలను సద్వినియోగించుకోవాలన్నారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్‌రావు, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, అహ్మద్, లక్ష్మణ్, వెంకన్న ఉన్నారు.

'సివిల్స్‌లో ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేయాలి'

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 21: సివిల్స్‌లో ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతిష్ఠాత్మక పరీక్షల్లో ఇంటర్వ్యూ విధానంతో ఓబీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాత పరీక్షలో అత్యధిక మార్కులు సాధిస్తున్న ఓబీసీలకు ఇంటర్వ్యూలలో తక్కువ మార్కులు వేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, ఈశ్వర్, శేఖర్, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

దేవరకొండ, కట్టంగూరు, ఏప్రిల్ 21: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజుయాదవ్, జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ అన్నారు. దేవరకొండలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 24న నల్లగొండలో ఓబీసీ మోర్చా జిల్లా సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, రెడ్డి శంకర్, చండీశ్వర్ పాల్గొన్నారు. భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని బీజేపీ నాయకులు ఆదివారం కట్టంగూరు మండలంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పబ్బు వెంకటేశ్వర్లు, కోమటి భాస్కర్, ఓరుగంటి హరిబాబు, ముర్సు భిక్షపతి, పులకరం శంకర్, బసవోజు వినోద్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 21: జిల్లాకేంద్రంలోని గొల్లగూడ పెద్దబండలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయ స్వామి దేవాలయం, వీరాంజనేయస్వామి, మల్లికార్జున స్వామి విగ్రహాలు, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి వేద మంత్రోచ్చరణతో స్వామివార్ల శిలామూర్తులను ప్రతిష్ఠించారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఎంపీపీ కరీంపాషా, కౌన్సిలర్ గోగుల శ్రీనివాస్, అభిమన్యు శ్రీని వాస్, అల్లి సుభాష్, పిల్లిరామరాజు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నోముల యాదయ్య, మాజీ కౌన్సిలర్ సలీం, శంకర్, రాము, కొత్త అశోక్, జానీ, సత్తయ్య, సైదులు ఉన్నారు.

కాస్త ఉపశమనం



తిప్పర్తిలోని మార్కెట్ యార్డులో ధాన్యం రాశులపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

జిల్లాలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. పెద్దఎత్తున ఈదురు గాలులు వీయడంతో అప్రమత్తమైన రైతులు పలుచోట్ల ధాన్యం రాశులపై పట్టాలు కప్పారు. పగలు 44.7 డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదుకాగా, సాయంత్రానికి ఈదురు గాలులతో వాతావరణ చల్లబడింది. నల్లగొండ జిల్లాకేంద్రంలో సాయంత్రం కురవడంతో వాతావరణం చల్లబడింది. శాలిగౌరారంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.



తిప్పర్తిలో వర్షం భయంతో ధాన్యం కుప్ప చేస్తున్న రైతులు



నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ ప్రాంతంలో కురుస్తున్న వర్షం



నల్లగొండలో ఈదురుగాలులకు విరిగిన చెట్టు



నల్లగొండ జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద కురుస్తున్న వర్షం



నల్లగొండ పట్టణంలో వర్షంలో చిన్నారుల కేరింతలు

భువనగిరికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



శాలిగౌరారం నుంచి బయలుదేరుతున్న కార్యకర్తలు



కట్టంగూరు నుంచి బయలుదేరుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

శాలిగౌరారం, కట్టంగూరు, నార్కట్‌పల్లి, మునుగోడు, ఏప్రిల్ 21: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభకు శాలిగౌరారం మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున వాహనాల్లో తరలి వెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్లారు. కట్టంగూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వాహనాల్లో భువనగిరికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ది సుక్కయ్య, మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, పెద్ది యాదగిరి, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, అయితగోని నారాయణ, నంద్యాల వెంకట్‌రెడ్డి, బూరు గు శ్రీను, గుండు పరమేష్, మిట్టపల్లి శివశంకర్ ఉన్నారు. నార్కట్‌పల్లి నుంచి తరలి వెళ్లిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, గడుసు శశిధర్‌రెడ్డి, రాధారపు బిక్షపతి, వారాల రమేశ్, దార యాదయ్య ఉన్నారు. మునుగోడు నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాష్‌నేత, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, భూడిద లింగయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, భీమనపల్లి సైదులు తదితరులు ఉన్నారు.

సాయిబాబా మందిరం అభివృద్ధికి కృషి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 21: నకిరేకల్‌లోని షిర్డీ సాయిబాబా మందిర అభివృద్ధికి కృషిచేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. షిర్డీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రతినిధులు ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి, దేవాలయ ట్రస్ట్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, సహాయ కార్యదర్శి బాణాల రాంరెడ్డి, వలిశెట్టి స్వప్న, తొనుపునూరి రాంబాబు, వీరవెల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ, ఏప్రిల్ 21: కరీంనగర్‌లో ఈ నెల 27, 28, 29, 30వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా తరుపున పాల్గొనే క్రీడాకారులను ఆదివారం జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్, చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్ ఎంపికలను పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 70 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరైనట్లు వారు తెలిపారు.

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 21: నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. దేవరకొండలో ఆదివారం జరిగిన నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఐదు న్యాయ సూత్రాలతో కూడిన మేనిఫెస్టో కరపత్రాన్ని విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తలపై ఉందన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పట్టించుకోలేదని, నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడంతోనే కరువు పరిస్థితులు వచ్చాయన్నారు. యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొర్ర రాంసింగ్, జయంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి



కేతేపల్లి: కొప్పోలు ఐకేపీ కేంద్రంలో ఓట్లు అభ్యర్థిస్తున్న సీపీఎం నాయకులు

కట్టంగూరు, నార్కట్‌పల్లి, మునుగోడు, చిట్యాల, కేతేపల్లి, నకిరేకల్, ఏప్రిల్ 21: సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కట్టంగూరు మండలంలోని బొల్లేపల్లి, తెరిదేవిగూడెం గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నపాక లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, అద్దంకి నర్సింహ, కట్ట బక్కయ్య తదితరులు ఉన్నారు. సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ గెలుపుకోరుతూ నార్కట్‌పల్లిలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేది సీపీఎం మాత్రమేనని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, చింతపల్లి బయ్యన్న, ఆమనగంటి ఐలయ్య, మంద గోపాలు ఉన్నారు. మునుగోడులో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మిర్యాల భరత్‌కుమార్, యసరాణి శ్రీను, లింగస్వామి, యాదయ్య, సాగర్ల మల్లేష్, అయోధ్య రాజు పాల్గొన్నారు. చిట్యాలలో జరిగిన రైస్‌మిల్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అక్కెనపల్లి నాగయ్య, కల్లూరి నారాయణరెడ్డి, బండారు శంకరయ్య, జడల మల్లేషం తదితరులు పాల్గొన్నారు. కేతేపల్లి మండలంలోని కొప్పోలులో సీపీఎం సీనియర్ నాయకుడు బోళ్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఇంటి ంటి ప్రచారం నిర్వహించారు. ఐకేపీ మార్కెట్‌లో రైతులు, హమాలీలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి. చినవెంకులు, సీహెచ్. లూర్దుమారయ్య, ఎల్. రాజు, కర్ర బాలయ్య, ఎస్. వెంకన్న, యాకోబు, అయ్యన్న, గాదె సత్తిరెడ్డి పాల్గొన్నారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాళ ప్రమీళ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, కొప్పుల అంజయ్య, బక్కయ్య, జోరెపల్లి యల్లయ్య, ఎల్లయ్య, బొస్క యేసు పాల్గొన్నారు.

మధ్యలో వచ్చిన నాయకులే బీఆర్‌ఎస్‌ను వీడారు

మునుగోడు, ఏప్రిల్ 21: బీఆర్‌ఎస్‌లో మధ్యలో వచ్చిన కొందరు నేతలు సొంత ప్రయోజనాలకు పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వలసలు వెళ్తున్నారే తప్ప నిజమైన క్యాడర్ మాత్రం బలంగానే ఉందని ఆ పార్టీ మునుగోడు మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీష్ అన్నారు. మునుగోడులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించి ఉద్యమ పార్టీగా ఎదిగిన బీఆర్‌ఎస్‌కు క్యాడర్ చెక్కుచెదరలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కందుల రాజుగౌడ్, లింగస్వామిగౌడ్, వెంకన్న, వంశీకృష్ణ, బత్తుల వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

మునుగోడు, ఏప్రిల్ 21: మునుగోడు ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ (బీఆర్‌ఎస్), బీఆర్‌ఎస మండల నాయకుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాష్‌నేత, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి భూడిద లింగయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, బొల్లం వెంకన్నయాదవ్, తాటికొండ సైదులుయాదవ్, బీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్ జక్కలి శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

త్రిపురారం, ఏప్రిల్ 21: బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కోరారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి వెంకటాచారి, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న యాదవ్, జంగిలి శ్రీను, మడుపు వెంకటేశ్వర్లు, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ కానుక అందజేత

దేవరకొండ, ఏప్రిల్ 21: మండలంలోని మైనంపల్లి ఎంపీటీసీ కొర్ర గౌతమి రాంసింగ్ మూడు సంవత్సరాలుగా ఆడబిడ్డ వివాహ సమయంలో రూ.2116లు రామన్న కళ్యాణ కానుకగా అందిస్తున్నారు. దీంతోపాటు ఎంపీటీసీ పరిధిలో ఆడబిడ్డ పుడితే బంగారుతల్లి కానుక పేరుతో రూ.2116 అందజేస్తున్నారు. ఆదివారం మైనంపల్లి కొర్రతండాలో జరిగిన వివాహానికి ఎమ్మెల్యే బాలునాయక్ హాజరై కల్యాణ కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ వెంకటయ్యగౌడ్, శ్రీశైలం యాదవ్, హరికృష్ణ, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో శిల్గాపూర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 21: గురుకుల ఫలితాల్లో మండలంలోని శిల్గాపూర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ కట్టెబోయిన సైదయ్య తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పాఠశాల నుంచి 25మంది విద్యార్థులకు గాను 22మంది గురుకులంలో సీట్లు సాధించారని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాల నుంచి విద్యార్థులు గురుకులంలో అత్యధికంగా సీట్లు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, ఎరనాగుల సైదులు, శిరీష, కల్పన, వసంత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వీరమ్మ పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

మర్రిగూడ, ఏప్రిల్ 21: భక్తి భావం కలిగి ఉండాలని వట్టిపల్లి మాజీ ఎంపీటీసీ రమావత్ భీమానాయక్ లలిత అన్నారు. భీమానాయక్ ఇచ్చిన రూ.లక్ష విరాళంతో మండలంలోని రాజు పేటతండా గ్రామపంచాయతీ పరిధిలోని పద్మశాలికాలనీలో ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణ ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అగ్నిహోమం నిర్వహించారు. కార్యక్రమంలో కోటేష్, రాజేందర్, ఈశ్వర్, జయప్రసాద్, రవి, రాపోలు యాదగిరి, గోపినాయక్, అల్వాల్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

కూలీ కుటుంబానికి చేయూత

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 21: నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన గన్నెపాక కొండయ్య(48) వడదెబ్బతో ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గ్రామ యువకులు అండగా నిలిచారు. రూ.26వేల నగదు, 25కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాచారి, కాశీమల్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సన్మానం

చిట్యాల, ఏప్రిల్ 21: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. అట్టి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను ఆదివారం కనకదుర్గ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బొబ్బల శివశంకర్‌రెడ్డి సన్మానించారు.

క్లాస్‌మేట్ వివాహానికి ఆర్థిక సాయం

చిట్యాల, ఏప్రిల్ 21: చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్, ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు తమ క్లాస్‌మేట్ కసిరెడ్డి ప్రభ కుమార్తె వివాహానికి రూ.95450 ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో మూడ వెంకటాద్రి, అమరోజు దయానంద్, జోర్రిగల జ్యోతి, పెద్దగోని మాధవి తదితరులు పాల్గొన్నారు

బీజేపీ పదాధికారులకు నియామకపత్రాలు అందజేత

మునుగోడు, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్ అన్నారు. మునుగోడులో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంతో పదాధికారులకు నియామక పత్రాలు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు దర్శనం వేణుకుమార్, బొడిగె అశోక్‌గౌడ్, మదగోని నరేందర్‌గౌడ్, బండారు యాదయ్య, కమ్మంపాటి నర్సింహ, ఆంజనేయులు, పందుల సత్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యం

మర్రిగూడ, ఏప్రిల్ 21: భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు మేకల జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను మండలకేంద్రంలో ఆదివారం సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాందాసు శ్రీనివాస్, ఎంపీటీసీలు గండికోట రాజమణిహరికృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్నమనేని రవీందర్‌రావు, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మాస శేఖర్‌నీలిమా, లపంగి వజ్రమ్మ, అనిల్‌రెడ్డి, జగాల్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు వృద్ధురాలు అప్పగింత

మాడ్గులపల్లి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలో గత కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వృద్ధురాలిని స్థానికులు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీంతో ఏఎస్‌ఐ జాఫర్, హోంగార్డు లక్ష్మీనారాయణలు ఆ వృద్ధురాలి కుటుంసభ్యుల ఆచూకీ తెలుసుకొని మిర్యాలగూడ ఉంటున్న ఆమె కుమార్తె సైదమ్మను ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వృద్ధురాలిని ఆమెకు అప్పగించారు.